ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025





# నేటి నుంచి పాతగుట్టలో బ్రహ్మోత్సవ సంరంభం!!





**బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన 'పాతగుట్ట'**

**7 నుండి 13 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు**

**శుక్రవారం స్వస్తివాచనంతో ఉత్సవాలు షురూ**

**9న ఎదుర్కోలు, 10న కల్యాణం, 11న రథోత్సవం**

**13న అష్టోత్తర శతఘటాభిషేకంతో**

**బ్రహ్మోత్సవాలు ముగింపు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట దేవస్థానానికి అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 7 నుండి 13 వరకు వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆఫీసర్లు కంప్లీట్ చేశారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలో లైటింగ్, భక్తులు సేద తీరడం కోసం చలువ పందిళ్లు, మంచినీటి వసతితో పాటు ఆలయానికి, కల్యాణ మండపానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. యాదగిరిగుట్టలోని పాతగుట్ట చౌరస్తా నుండి పాతగుట్ట ఆలయం వరకు ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు పోలీసులతో ప్రత్యేక నిఘా, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**స్వస్తివాచనంతో మొదలు కానున్న బ్రహ్మోత్సవాలు**

గత నాలుగు రోజులుగా జరుగుతున్న అధ్యయనోత్సవాలకు



గురువారం ముగింపు పలికిన అర్చకులు.. శుక్రవారం స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణం, మృత్సంగ్రహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య ఘట్టాలు 9న ఎదుర్కోలు, 10న తిరుకల్యాణం, 11న దివ్యవిమాన రథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పలు రకాల స్వామివారి అలంకార సేవలను చేపట్టనున్నారు. దీనికోసం స్వామివారి వాహనాలను సిద్ధం చేశారు. ఇక 10న రాత్రి నిర్వహించే స్వామివారి తిరుకల్యాణంలో భక్తులు పాల్గొనడానికి కల్యాణ టికెట్లను అందుబాటులోకి తెచ్చారు. భక్తులకు విక్రయించే బ్రహ్మోత్సవ కల్యాణ టికెట్ ధరను రూ.600 గా నిర్ణయించారు. 13న నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. ఇక అధ్యయనోత్సవాలు, వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఈ నెల 3 నుండి 13 వరకు భక్తుల చేత నిత్యం నిర్వహించే ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం వంటి పూజలను తాత్కాలికంగా రద్దు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం ఈ నెల 14 నుండి ఆర్జిత సేవలను తిరిగి పునరుద్ధరణ కానున్నాయి.

**పాతగుట్ట బ్రహ్మోత్సవ కార్యక్రమాల వివరాలు**

07.02.2025 ఉదయం స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం.. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణం

08.02.2025 ఉదయం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ట, వేదపారాయణాలు.. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం

09.02.2025 ఉదయం సింహవాహన సేవ, సాయంత్రం ఎదుర్కోలు మహోత్సవం(అశ్వవాహన సేవ)

10.02.2025 ఉదయం తిరుమంజనం, హనుమంత వాహన సేవ.. రాత్రి తిరుకల్యాణ మహోత్సవం(గజవాహన సేవ)

11.02.2025 ఉదయం గరుడ వాహన సేవ.. సాయంత్రం రథాంగ హోమం, దివ్యవిమాన రథోత్సవం

12.02.2025 ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం.. సాయంత్రం దేవతోద్వాసన, పుష్పయాగం, డోలోత్సవం

13.02.2025 ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం.. మధ్యాహ్నం మహదాశీర్వచనం, పండిత సన్మానం, ఉత్సవసమాప్తి





# పాతగుట్టలో ముగిసిన అధ్యయనోత్సవాలు



## 'నూత్తందాది శాత్తుమొరై' పూజలతో ఉత్సవాలు పరిసమాప్తి

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట క్షేత్రానికి అనుబంధ దేవాలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 3న మొదలై నాలుగు రోజులుగా వైభవంగా సాగిన అధ్యయనోత్సవాలు గురువారం నిర్వహించిన 'నూత్తందాది శాత్తుమొరై' పూజలతో పరిసమాప్తం అయ్యాయి. ఆలయంలో స్వామివారికి నిత్యారాధనలు ముగిసిన అనంతరం.. ఆలయ ఉప ప్రధానార్చకులు మాధవాచార్యుల అర్చకత్వంలో అర్చకులు పురప్పాటు సేవ, రామానుజాచార్య తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామిఅమ్మవార్లను అందంగా ముస్తాబు చేసి ఆలయ తిరువీధుల్లో విహరింపజేశారు. అనంతరం స్వామివారి మూలవరులకు 'నూత్తందాది శాత్తుమొరై' పూజలు నిర్వహించారు. ఈ పూజలతో అధ్యయనోత్సవాలు ముగిశాయని ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, అర్చకులు, వేదపండితులు, పారాయణీకులు తదితరులు ఉన్నారు.

